క్లుప్తంగా

బెంచీల బహూకరణ



మహబూబాబాద్ అర్బన్: ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ తిరుపతిరెడ్డి సువిజరెడ్డి దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి, ఈదులపూసపల్లి, సింగారం ప్రభుత్వ పాఠశాలలకు రూ.లక్ష విలువ గల డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశామని ఏకశిల హైస్కూల్ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పూజరి వీరయ్య, సమ్మెట వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విరాళాల అందజేత

చిన్నగూడూరు: మండలంలోని గంగమ్మ తల్లి ఆలయం అభివృద్ధి కోసం మండల కేంద్రానికి చెందిన పలువురు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేశారు. మండల కేంద్రంలోని పరమేశ్వరీ రైస్ మిల్ యజమాని బొల్లం సోమన్న రూ. 31,116లు, ప్రభుత్వ ఉద్యోగి జక్కి రాంబాబు, మహంకాళి ప్రసాద్ రూ.10వేలు చొప్పున విరాళంగా యాదవ సంఘం కమిటీ నిర్వాహకులకు అందజేశారు.

స్కూల్ ఫీజు చెల్లించిన బాల్యమిత్రులు



కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామానికి చెందిన గోపాల వెంకట్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే మృతుడి కుమారుడు త్రివిక్‌రెడ్డి కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో 5వ తరగతి చదివించేందుకు గాను, కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 1994–95 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు కలిసి శనివారం రూ.10వేల ఫీజు చెల్లించగా, పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ రూ.16వేల ఫీజులో, రూ.6వేల ఫీజు మినహాయించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రకాష్, వీరన్న, శ్రీనివాస్, సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

భరోసా కల్పించాలి

గార్ల: చట్టాలు నేరస్తులను శిక్షించడానికి మాత్రమే కాదు బాధితులకు భరోసా కల్పించాలని విశ్వసమాజం వ్యవస్థాపకుడు ప్రముఖ లాయర్ జంపాల విశ్వ అన్నారు. శనివారం గార్లలోని న్యాయవాద కార్యాలయంలో యువ న్యాయవాదులైన ప్రవీణ్‌బాబు, లక్ష్మణ్‌లకు పాత కొత్త క్రిమినల్ మేజర్ చట్టాల టేబుల్స్‌లో ఉన్నటువంటి ఏఎల్‌టీ పబ్లికేషన్ పుస్తకాలను విశ్వ బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, కందునూరి శ్రీనివాస్, వజ్రం నాగేశ్వరరావు, దాసరి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి

గూడూరు: రాజ్యాంగం రూపొందించిన ఆదివాసీ చట్టాలను పాలకులు అమలు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రావు, సారయ్య, మంగయ్య, సాంబయ్య మల్లికార్జున్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కురవి: మండల కేంద్రంలో నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శారద శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయ్యగారిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సరఫరా విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

రాత బాగుంటే మంచి మార్కులు

- పరీక్షల్లో దస్తూరి కీలకం
- ఒత్తిడి, ఆందోళన వద్దంటున్న ఉపాధ్యాయులు

సండే స్పెషల్

పెద్దవంగర: శిలపై ఉలితో అక్షరాలు చెక్కే కాలమైనా.. ఆధునిక యుగంలో కంప్యూటరుపై అక్షరాలు పేర్చే యుగమైనా.. అక్షరాలకు ప్రత్యేక స్థానం. చేతిరాతను బట్టి వ్యక్తి గుణగణాలను అంచనా వేయవచ్చంటారు గ్రాఫాలజిస్టులు. పరీక్షలో అదనంగా మార్కులు సాధించేందుకు దస్తూరి కీలకంగా మారుతోంది. సమాధాన పత్రం మూల్యాంకనం చేసేవారి మనసును హత్తుకునేలా దస్తూరి ఉండి, విషయం ఉంటే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. మార్చి 21నుంచి 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

275 మంది విద్యార్థులు..



చేతిరాత సాధన చేస్తున్న విద్యార్థులు

మండల కేంద్రంతోపాటు మండలంలోని బొమ్మకల్లు, చిట్యాల, వడ్డెకొత్తపల్లి, అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు కస్తూర్బాగాంధీ గురుకులం, జ్యోతిబాపూలే బాలుర పాఠశాలల్లో సుమారు 275మంది విద్యార్థులు పదో తరగతిలో వార్షిక పరీక్షలు రాయనున్నారు. ప్రస్తుతం వీరి ధ్యాసంతా చదువుపైనే నెలకొంది. కాగా దస్తూరీపై దృష్టి పెట్టేది కొద్ది మందే. పరీక్షలో సమాధానాలు ఉన్నది ఉన్నట్లు రాసినా.. దస్తూరి బాగా లేకపోతే మార్కులు తక్కువ పడే ప్రమాదం ఉంది. దస్తూరి బాగుంటే జవాబు స్పష్టంగా అర్థం అయ్యి ఎక్కువ మార్కులు వేసేందుకు వీలుంటుంది.

సాధన చేస్తే ఇబ్బందులు ఉండవు..



ఏడాదిపాటు చదివిన పాఠ్యాంశాలను రెండున్నర గంటల్లో సమాధాన పత్రంపై పెట్టాలి. పరీక్షల సమయంలో సహజంగా హడావుడి, ఆందోళన ఉంటుంది. కొందరూ రాతపై పట్టు కోల్పోతుంటారు. దీంతో అక్షరాలు కుదిరించి రాయలేక పోతుంటారు. దీన్ని అధిగామించాలంటే ముందుగానే దస్తూరి సాధన చేస్తే పరీక్షల్లో ఇబ్బందులు ఉండవని ఉపాధ్యాయుల సూచన. ఆణిముత్యాలాంటి అక్షరం కోసం విద్యార్థులకు కొన్ని పద్ధతులు పాటించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

చక్కటి రాత సాధనతోనే సాధ్యం



చక్కటి చేతిరాత రావాలంటే సాధనతోనే సాధ్యమవుతుంది. చేతి రాతను అభివృద్ధి చేసుకునేందుకు ప్రతీ రోజు కొంత సమయాన్ని కేటాయించాలి. తొలి ప్రశ్న నుంచి చివరి ప్రశ్న వరకు సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనిసరి.

– తోమాల సువర్ణ, తెలుగు ఉపాధ్యాయురాలు, పెద్దవంగర

అక్షరాలు స్పష్టంగా ఉండాలి



ఏ సబ్జెక్టు అయినా సరే సమాధానం చక్కగా, స్పష్టంగా రాయాలి. కొట్టివేతలు, దిద్దుబాటు సరికాదు. అందమైన చేతిరాతతోపాటు అక్షర దోషాలు లేకుండా జవాబు పత్రాన్ని అందంగా.. ఆకట్టుకనేలా ఉంచాలి. అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం రాయాలి.

– లీలాశోభరాణి, హెచ్‌ఎం, బొమ్మకల్లు

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు

- షీ టీం ఎస్సై సునంద

మహబూబాబాద్ అర్బన్: బాలికలను వేధిస్తే నూతన చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని షీటీం ఎస్సై సునంద అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మ గూడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో శనివారం సైబర్ క్రైం, నూతన చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై సునంద మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో మాట్లాడవద్దని, లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. బ్యాంక్ అకౌంట్ల నుంచి డబ్బులు పోయినప్పుడు వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మొగలయ్య, హెచ్‌డబ్ల్యూఓ జయసుధా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షీటీం ఎస్సై సునంద

పుస్తకాలు అందించడం అభినందనీయం



పుస్తకాలు అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ రూరల్: కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సబ్ జైల్ గ్రంథాలయానికి మహనీయుల జీవిత చరిత్ర, వ్యక్తిత్వ వికాసం పుస్తకాలను శనివారం అందజేశారు. ఈసందర్భంగా జైలర్ మల్లెల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాళోజీ వాకర్స్ అసోసియేషన్ మహనీయుల జీవిత చరిత్ర, వ్యక్తిత్వ వికాసం పుస్తకాలను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. మునుముందు మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టి సమాజాభివృద్ధికి తోడ్పడాలని, పుస్తక పఠనం వలన ప్రతి మనిషిలో మార్పు వస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య సలహాదారులు మైస నాగయ్య, ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, మైస శ్రీనివాసులు, ప్రముఖ సామాజిక నాయకులు శంతన్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

తొర్రూరు: మండలంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు తమ్మెర విశ్వేశ్వరరావు, మాస్‌లైన్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవిలు డిమాండ్ చేశారు. తొర్రూరు ప్రాంత సమస్యల పరిష్కారం కోరుతూ వామపక్ష పార్టీలతో కూడిన ప్రజా సమస్యల పరిష్కార పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ గణేష్‌కు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మారిన తొర్రూరులో 100పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, మినీ ట్యాంకు బండ్ పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు బొల్లం అశోక్, ఓమ భిక్షపతి, ఎండీ యాకూబ్, బందు మహేందర్, కిరణ్, వీరన్న, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

రేపు ఎమ్మెల్సీ కవిత రాక

కురవి/దంతాలపల్లి/డోర్నకల్: ఈనెల 24వ తేదీన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కురవి మండల కేంద్రానికి రానున్నట్లు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తెలిపారు. శనివారం మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామిని దర్శించుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, నాయకులు పిచ్చిరెడ్డి, శ్రీదేవి, రవినాయక్, నర్సయ్య, రాజునాయక్, బోజ్యానాయక్, విజయ్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలి

పెద్దవంగర: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరబాబు అన్నారు. యూఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యాలయంలో ఎంఈఓ బుదారపు శ్రీనివాస్‌కు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇమ్రాన్, సుధీర్, ప్రణయ్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ

గూడూరు: రాష్ట్రంలో మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తూ, మహిళా సాధికారత సాధించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా మన్ననలు పొందుతున్న పాలన చూసి ఓర్వలేని ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఎన్నో కుట్రలను పన్నుతుందన్నారు. పది సంవత్సరాల పాలనలో ప్రజలను, రాష్ట్రాన్ని దోచుకున్న ఘనత వారికే దక్కిన విషయాన్ని ప్రజలు గుర్తించారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, మాజీ సర్పంచ్ నూనావత్ రాధ, అయిలబోయిన సమ్మక్క, భూక్య పద్మ, కన్నబోయిన వెంకన్న, శివ, మల్లేష్, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూనావత్ రాధ

‘ఎమ్మెల్సీగా సరోత్తంరెడ్డిని గెలిపించాలి’



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలో పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్సీ కోఆర్డినేటర్ గడ్డం అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్ శర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు గురుకుల, ప్రభుత్వ పాఠశాలలో శనివారం బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. ఈసందర్భంగా గడ్డం అశోక్, శ్యామ్ శర్మ మాట్లాడుతూ.. చట్టసభల్లో ఉపాధ్యాయుల సమస్యలపై బీజేపీ పోరాడి పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. మొదటి ప్రాధాన్యతతో ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్, నాయకులు సురేందర్, మురళీ, పద్మ, సంపత్, సందీప్, ప్రేమ్‌రాయుడు పాల్గొన్నారు.

బహుజనులంతా ఏకం కావాలి

గూడూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనులంతా ఏకం కావాలని, బీసీ బిడ్డ సుందర్‌యాదవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మెపా మహబూబాబాద్ పట్టణ కమిటీ అధ్యక్షుడు చొప్పరి ప్రశాంత్ కోరారు. మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతోపాటు పలు ఆశ్రమ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌రాజ్‌యాదవ్ గెలుపుకోసం ప్రచారం చేశారు. కార్యక్రమంలో వంశీ, పవన్, అనిల్, మనోజ్ పాల్గొన్నారు.

ఇప్పపువ్వు లడ్డూతో రక్తహీనత తగ్గింపు



మాట్లాడుతున్న అధికారులు

గంగారం: ఇప్పపువ్వు లడ్డూతో గర్భిణీలకు రక్తహీనత తగ్గించవచ్చని గంగారం ఎంఓ డాక్టర్ ప్రత్యూష, గూడూరు సీడీపీఓ నీలోఫర్ అజ్మీ, ఐటీడీఏ ఏటూర్ నాగారం ఎస్‌ఓ సురేష్‌లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న అటవీ సంపదను సద్వినియోగం చేసుకొని ప్రజలకు ఉపయోగపడే విధంగా తయారుచేసేందుకు ప్రాజెక్టును చేపట్టడం జరిగిందని, దీనిలో భాగంగా ఇప్పపువ్వుతో లడ్డు తయారుచేసి గర్భిణీలకు, బాలింతలకు అందించడంతో వారికి రక్తహీనత తగ్గించవచ్చన్నారు. ఈ ప్రాజెక్టును ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరులో ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేడీఎం కొండల్‌రావు, ఐకేపీ సీసీ విజయ, ఏపీఎం శ్రీనివాస్, వీఓఏ రమేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల, ఏబీపీ శ్రీధర్, ఈశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కురవి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సీరోలు మండల స్పెషల్ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల అన్నారు. శనివారం సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌస్, తహసీల్దార్ శారద, ప్రిన్సిపాల్ సంతోష్‌సోని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డోర్నకల్: గురుకులాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి ఆదేశించారు. మండల కేంద్రంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలతోపాటు కళాశాలలో శనివారం మండల ప్రత్యేక అధికారితోపాటు తహసీల్దారు కృష్ణవేణి, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్ తనిఖీ చేశారు.



కురవి: విద్యార్థులతో భోజనం చేస్తున్న అధికారులు

సంక్షిప్త సమాచారం

బస్టాండ్ అభివృద్ధికి పాటుపడాలి

దంతాలపల్లి: మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికిపాటు పడాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త సేను రాజేష్ శనివారం తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని, విద్యుత్, మరుగుదొడ్ల, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే బస్సులన్నీ బస్టాండ్‌లోనే నిలిపే విధంగా చొరవ తీసుకోవాలన్నారు.

జయప్రదం చేయండి

గార్ల: ఇల్లెందు పట్టణంలో ఈనెల 24న నిర్వహించే సేవాలాల్ జయంతి ముగింపు శోభాయాత్రను జయప్రదం చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు కోరారు. శనివారం గార్లలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో గంగావత్ రాంసింగ్, మాన్‌సింగ్, ఏఎంసీ డైరెక్టర్ అశోక్, సురేష్, హరికిషన్, రామ్‌కుమార్, మల్లిబాబు, బాబూలాల్ పాల్గొన్నారు.

బాల కుమారస్వామి జాతర ప్రారంభం

గంగారం: బాల కుమారస్వామి జాతర మండలంలోని మడగూడెం గ్రామంలో అంగరంగ వైభవంగా ఆదివాసీ సంప్రదాయాల నడుమ శనివారం ప్రారంభమయ్యాయి. శనివారం మధ్యాహ్నం 2గంటలకు వనం తెచ్చే కారక్యక్రమంలో 5గంటలకు పాన్పును తీసుకొచ్చి బాలకుమారస్వామి గద్దెలపై ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జాతన సన్నిధిలో ఈనెల 22, 23, 24 తేదీల్లో వాలీబాల్ క్రీడలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పట్టుదలతో చదవాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు పట్టుదల, ఏకగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరాలని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ విద్యార్థులకు విడ్కోల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీపాల్‌రెడ్డి, డైరెక్టర్ డోలి సాధన, లింగుబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెండి వస్తువు బహూకరణ

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి వారికి ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన భక్తుడు వేదం నరేష్‌కుమార్ శర్మ వెండి వస్తువును శనివారం బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఇఓ సత్యనారాయణ, చైర్మన్ కొర్నె రవీందర్‌రెడ్డి, ధర్మకర్త బాలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక వేలం

డోర్నకల్: స్థానిక మైనారిటీ కళాశాల సమీపంలో ఇటీవల సీజ్ చేసిన ఇసుకను శనివారం వేలం నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణవేణి ఆధ్వర్యంలో ఏడు ట్రాక్టర్ల నిల్వ కలిగిన ఇసుకకు వేలం నిర్వహించగా యాదవనగర్‌కు చెందిన దాసరి శ్రీను రూ.13వేలకు కొనుగోలు చేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మహబూబాబాద్ రూరల్: అఖిల భారత పద్మశాలి సంఘం 17వ, తెలంగాణ ప్రాంత సంఘం 8వ మహాసభ మార్చి 9వ తేదీన హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఆవరణలో జరుగనుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచందర్, జిల్లా అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు అన్నారు. మహాసభ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనుమాండ్ల వెంకటేశ్వర్లు, బొమ్మ వెంకటేశ్వర్లు, కల్వకుంట్ల శ్రీనివాస్, కొమ్మాకుల రాజేశ్వరరావు, బాల్నె సుమన్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

తొర్రూరు: పోలీస్ వాహనం ఢీకొని వృద్ధుడు గాయపడిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చీకటాయపాలెం గ్రామానికి చెందిన బద్ది నాగయ్య, అనే వృద్ధుడు పట్టణంలోని దుబ్బతండా సమీపంలో రోడ్డు దాటుతుండగా పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడి తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్త వరంగల్‌కు తరలించారు.

వాలీబాల్ కిట్ల అందజేత

గార్ల: గార్లలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదువుతున్న బాలికలకు యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎస్‌కె.యాకూబ్‌పాషా, భూక్యా బాబూలాల్‌లు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్‌రెడ్డి, శాంతికుమార్, శ్రీకాంత్, తరుణ్, హెచ్‌ఎం ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

బయ్యారం: మండల కేంద్రంలో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ప్రారంభమైనాయి. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి క్రీడలకు హాజరయ్యారు.

నాల్గో ప్లాట్‌ఫాం లేకుంటే ఎలా?

మహబూబాబాద్ రూరల్: రైల్వే సార్లూ.. నాల్గో నంబర్ ప్లాట్‌ఫాం లేకుండానే మూడో లైన్ ఎట్లేస్తరని జిల్లా కాంగ్రెస్ నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో జరుగుతున్న మూడో రైల్వే ట్రాక్ నిర్మాణ పనులను శనివారం శంతన్ రామరాజు పరిశీలించి మాట్లాడారు. మూడోలైన్ నిర్మాణంతో మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో వరంగల్ తరహాలో నాల్గో ప్లాట్‌ఫాం నిర్మించాల్సి ఉండగా ఇందుకు భిన్నంగా పనులు జరుగుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సాయికిరణ్ నేత, జక్క శంతన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం

మహబూబాబాద్: తెలంగాణలో టీడీపీ సభ్యత్వాలు 1.70లక్షలు దాటాయని, రాష్ట్రంలో టీడీపీకి పూర్వ వైభవం రానుందని పార్టీ టీడీపీనేనని మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి పుల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పతనం అవుతుందని, కాంగ్రెస్ పార్టీలో వారి వారే ఘర్షణ పడుతున్నారని పార్టీకి కూడా భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నెల్లికుదురు: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని నైనాల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెరుమాండ్ల నరేష్(38) మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు.

క్రైం కార్నర్..

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

తొర్రూరు రూరల్: మండలంలోని మాటేడు గ్రామంలో చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దూదిమెట్ల ఐలయ్య(48) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాతుక వెంకన్న శుక్రవారం మృతి చెందగా అంత్యక్రియల్లో పాల్గొని బంధువులతో కలిసి స్నానానికి చెరువులోకి దిగాడు. ఈత కొట్టే క్రమంలో చెరువు చివరి వరకు ఈదుతానని బంధువులతో చాలెంజ్ చేశాడు. ఈదే క్రమంలో అలసట వల్ల ఊపిరాడక నీట మునిగాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సహాయంతో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం చెరువులో గాలింపు చేపట్టగా శనివారం మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుడుంబా స్వాధీనం

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న 25లీటర్ల గుడుంబాను పట్టుకుని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేష్‌బాబు తెలిపాడు. శనివారం ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని ఆలేరు గ్రామ పరిధిలో వాహనాల తనిఖీ చేసి వావిలాల క్రాస్ రోడ్డు పరిధిలోకి వస్తున్న క్రమంలో రూ.10వేల విలువ చేసే 25లీటర్ల గుడుంబా క్యాన్‌తో మోటార్ సైకిల్‌పై ఇద్దరు వెళ్తూ పోలీసులను చూసి పారిపోతున్నట్లు తెలిపారు. వారిని వెంబడించి పట్టుకుని విచారించగా మండలంలోని సంధ్య తండాకు చెందిన బానోతు సంతోష్, ధర్మ తండాకు చెందిన బానోతు నరేష్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

బయ్యారం: భర్తతో ఘర్షణపడిన భార్య బావిలో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలోని రుద్రమదేవి వీధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రమదేవి వీధికి చెందిన బత్తుల పుష్ప(40) భర్త అప్పయ్యతో శుక్రవారం ఇంటి ఖర్చులకు డబ్బులు ఇవ్వడం లేదని ఘర్షణ పడింది. దీంతో క్షణికావేశానికి గురైన పుష్ప సాయంత్రం నుంచి కనపడకుండాపోయింది. ఆచూకీ కోసం వెతుకుతున్న సమయంలో ఇంటి పక్కనే ఉన్న బచ్చలి నర్సమ్మకు చెందిన చేత బావిలో శనివారం మృతదేహం కనపడింది. ఈమేరకు మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో రూ.2.50లక్షల సామగ్రి దగ్ధం

చిన్నగూడూరు: ఓ ఇంటిలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి విలువైన వస్తువులు దగ్ధమైన ఘటన మండలంలోని పగిడిపల్లి శివారు బాబోజీతండాలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబోజీతండాకు చెందిన గుగులోతు నరేష్ కుటుంబ సభ్యులతో కలిసి బీబీనగర్‌లో ఉన్న లింగబచ్చేశ్వర స్వామిని దర్శించుకునేందుకు బయలుదేరాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఇంట్లో నుంచి దట్టమైన పొగలతో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న 50కేజీల బొబ్బెర్లు, 50కేజీల జొన్నలు, 3క్వింటాల బియ్యం, రిఫ్రిజిరేటర్, కూలర్, ఫ్యాన్లు, దుస్తులు ఇతర సామగ్రి కాలిబూడిదైనట్లు తెలిపాడు. సుమారు రూ.2.50లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

స్వయం పాలన దినోత్సవం



కేసముద్రం విలేజ్ జెడ్పీ హైస్కూల్‌లో..



దంతాలపల్లి: కుమ్మరికుంట్ల జెడ్పీ హెచ్‌ఎస్‌లో..

కేసముద్రం/దంతాలపల్లి: కేసముద్రంవిలేజ్, కల్వల జెడ్పీహైస్కూల్, పెనుగొండ ప్రాథమిక పాఠశాలల్లో స్వయంపరిపాలన దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అలాగే దంతాలపల్లిలోని కుమ్మరికుంట్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు.